క్లుప్తంగా

పైడిరాజుకు అభినందన



పైడిరాజును అభినందిస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం: మలేషియా వేదికగా జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన జరజాపు పైడిరాజును విజయనగరం నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అవనాపు విక్రమ్ అభినందించారు. ఈ నెల 12 నుంచి 19 వరకు మలేషియాలో జరిగిన 36వ మాస్టర్స్ అథ్లెటిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించిన పైడిరాజు 800 మీటర్ల లాంగ్‌రన్‌లో కాంస్య పతకం సాధించారు. విశ్వ వేదికపై పతకాన్ని సాధించిన పైడిరాజును అవనాపు విక్రమ్‌తో పాటు పలువురు క్రీడాప్రోత్సాహకులు సోమవారం అభినందించారు. పైడిరాజు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

మద్యం దుకాణంపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగలో జాతీయ రహదారిని ఆనుకొని మద్యం షాపు నిర్వహిస్తున్నారని సర్పంచ్ టి.సీతారాం తహసీల్దార్ తాడ్డి గోవిందకు సోమవారం ఫిర్యాదు చేశారు. జనావాసాలను ఆనుకొని మద్యం షాపు నిర్వహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలియజేశారు.

మర్యాదపూర్వక కలయిక



డీఆర్వోను అభినందిస్తున్న రెవెన్యూ పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో)గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.శ్రీనివాసమూర్తిని జిల్లా రెవెన్యూ పెన్షనర్స్ సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో వివిధ కేడర్లలో పనిచేసిన అనుభవంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. డీఆర్వోను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు టి.రామారావు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు రొంగలి ఎర్నాయుడు, జి.అప్పలనాయుడు, కోటేశ్వరరావు, జగదీష్, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

భోగాపురం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కిషోర్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులపై సూచనలు చేశారు. రోడ్లపై చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని సూచించారు.

పీటీసీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ అప్పారావు

విజయనగరం క్రైమ్: పోలీసులంటే సేవకు, త్యాగానికి ప్రతీకని పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా సోమవారం పీటీసీ ఆవరణలో ప్రభుత్వ ఆస్పత్రి, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 53 మంది అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.రమేష్ పాల్గొన్నారు.

పోలీసుల విధులపై అవగాహన

విజయనగరం క్రైమ్: పోలీసుల విధులు, వారి త్యాగాలను రైల్వే జీఆర్పీ ఎస్సై వి.బాలాజీరావు విద్యార్థులకు వివరించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ వ్యవస్థ ఆవశ్యకతను, పోలీసుశాఖ చేపట్టే కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు.

ఉయ్యాల కంబాల ఉత్సవానికి సర్వం సిద్ధం

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో కీలకమైన చివరి ఘట్టం ఉయ్యాల కంబాల మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు సోమవారం తెలిపారు. మంగళవారం వేకువజాము నుంచి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, విశిష్ట అలంకరణలు జరుగుతాయన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

అపార్‌కు ఆపసోపాలు



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

- నత్తనడకన నమోదు ప్రక్రియ
- ఆధార్‌లో తేడాలే జాప్యానికి కారణం
- తప్పుల సవరణకు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు

విజయనగరం: నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి జీవితకాల గుర్తింపు సంఖ్యతో కార్డు జారీ చేయాలని మూడేళ్ల కిందటే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ మాదిరిగానే ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెల సంఖ్యతో గుర్తింపు కార్డు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థుల అకడమిక్ పురోగతిని అంచనా వేయడానికి ఇది ఉపయోగపడుతుంది. విజయనగరం నియోజకవర్గంలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వీటిని జారీ చేయాలని నిర్ణయించారు. విజయనగరం మున్సిపల్‌కార్పొరేషన్ పరిధిలో ఉన్న పాఠశాలలతో పాటు మండల పరిధిలోని పాఠశాలల్లో సుమారు 46వేల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ ఈ కార్డులు జారీ చేయాల్సి ఉంది. అపార్‌కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంఈఓ సీహెచ్ ఆనంద మూర్తి హెచ్‌ఎంలను ఆదేశించారు.

విద్యార్థుల వివరాల్లో తేడాలు

అపార్ కార్డుల జారీలో ఇబ్బందులు తప్పడం లేదు. కార్డుల జారీ బాధ్యతలను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. లక్ష్యం మేరకు కార్డులు జారీ చేయకపోతే తాఖీదులు ఇస్తామని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే హుకుం జారీ చేశారు. చాలా మంది విద్యార్థుల వివరాలు పాఠశాల దస్త్రాల్లో ఒక రకంగా.. ఆధార్ కార్డుల్లో మరో రకంగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో 30 నుంచి 50 శాతం వివరాలే దస్త్రాలు, ఆధార్ కార్డులతో సరిపోతున్నాయి. ఆధార్ నమోదులోనే ఎక్కువగా తప్పులుంటున్నాయి. ఒకసారి అపార్ కార్డు ఇస్తే విద్యార్థి చదువు పూర్తయ్యే వరకు ఇదే నంబరు ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల వివరాల నమోదులో పొరపాట్లుకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

ఇలా చేస్తే బాగుంటుంది

- పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లను అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు యూడైస్‌లో మార్చవచ్చు.
- స్కూల్‌లో అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు సర్టిఫికెట్ ఇస్తే ఈ వివరాల ప్రకారం ఆధార్ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
- ఆధార్ వివరాల సవరణ బాధ్యత ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుంది.

తప్పులు సవరించుకుంటేనే..

7–8 ఏళ్ల కిందట ఆధార్ తీసుకున్న వారి వివరాల్లో పెద్దఎత్తున తప్పులు ఉన్నాయి. ప్రస్తుతం అపార్ కార్డును ప్రాధాన్యతాంశంగా పరిగణించాలని చెబుతున్నారు. దీంతో ఆధార్‌లోని తప్పులను సరిచేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం ఆధార్ కేంద్రాలకు వెళ్లాలి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను పక్క గ్రామాలకు తీసుకెళ్లి ఆధార్‌లో తప్పులను సవరించుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ పనుల కారణంగా చాలామంది ఇందుకోసం సమయం వెచ్చించలేకపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 7 వినతులు వచ్చాయి. కమిషనర్ పి.నల్లనయ్య ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత విభాగాల అధికారులకు పంపించారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 3, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 2, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కో వినతి అందినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఏఓ మూర్తి, డీఈ మణికుమార్ పాల్గొన్నారు.

వీఓఏలను మారిస్తే సహించేదిలేదు



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూసపాటిరేగ: వెలుగు శాఖలో వీఓఏలును మారిస్తే సహించేది లేదని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం వెలుగు అధికారులు అచ్యుతరావు, అరుణతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులైన వీఓఏలను మార్చేందుకు కూటమి నాయకులు చూస్తున్నారని అన్నారు. గ్రామైఖ్య సంఘం, మండల సమైఖ్య ఎన్నికలను నిబంధనలు మేరకు నిర్వహించాలన్నారు. వీఓఏలను తొలిగించడానికి ఎటువంటి ప్రయత్నం చేసిన అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఆయనతో పాటు అల్లాడ రమేష్, మహంతి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీల ద్వారానే ఉపాధి పనులు చేయించాలి

పూసపాటిరేగ: గ్రామ పంచాయతీల ద్వారానే ఉపాధి హామీ పనులు చేయించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ ఎం.రాధికకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్ల పేరుతో కూటమి నాయకులు పనులు చేపట్టి నిధులు దోచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఆ ఆలోచనను విరమించుకోవాలని, 2024–25 సంవత్సరానికి మంజూరైన ఉపాధిహామీ పనులను గ్రామ పంచాయతీల ద్వారానే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, ఎస్.రమణ, డి.గణేష్, టి.సీతారాం, కె.శ్రీరాములు, బి.ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

రూ.6కోట్ల వరకు గ్రంథాలయ సెస్ బకాయిలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి లక్ష్మి

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.లక్ష్మి సోమవారం సందర్శించారు. ముందుగా గ్రంథాలయంలో రికార్డులు, గ్రంథాలయం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.6 కోట్లు వరకు పన్నులు బకాయిలు రావాల్సి ఉందన్నారు. ఒక్క విజయనగరం కార్పొరేషన్ నుంచే సుమారు రూ.4 కోట్లు వరకు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. పన్నులు వసూలు కాకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణ కష్టంగా మారుతోందన్నారు. జిల్లాలో దేవపల్లి, కుమిలి, ఎస్.కోటలో నూతన గ్రంథాలయ భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. నిధులు వచ్చిన వెంటనే టెండర్లు వేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు గ్రంథాలయశాఖ సూపరింటెండెంట్ టి.పి.కూర్మాచారి, కుమిలి గ్రంథాలయ అధికారి శీరపు ఇందుమతి ఉన్నారు.

ముమ్మరంగా ఫీవర్ సర్వే



నగరంలో ఫీవర్ సర్వే చేస్తున్న సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఫీవర్ సర్వే ముమ్మరంగా సాగుతోంది. 50 డివిజన్లలోని 61 సచివాలయాల పరిధిలో ఏఎన్‌ఎంలు, ఎమినిటీస్, హెల్త్ సెక్రటరీలు బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేస్తున్నారు. మంచినీటి నాణ్యతను పరీక్షించడం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటివి చేస్తున్నారు. కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు 15 రోజుల పాటు ప్రత్యేక ఫీవర్ సర్వే చేపట్టేందుకు కార్యచరణ రూపొందించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి డయేరియా కేసులు ఏమైనా ఉన్నాయా, జ్వరాలతో ఎవరైనా బాధపడుతున్నారా, పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది, తదితర వివరాలు సేకరిస్తున్నారు. తాగునీటి నాణ్యత పరీక్షలను ఎమినిటీస్ కార్యదర్శులు చేపడుతున్నారు. అలాగే హెల్త్ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రత, దోమలు వృద్ధిచెందకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు అన్యాయం చేయడం తగదు

విజయనగరం టౌన్: భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో ఇటీవల యాజమాన్యం ప్రవేశపెట్టిన మార్పులను రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఐఆర్‌డీఏ రాజకీయ వ్యవహారాల చైర్మన్ ఎన్.గజపతిరావు అన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో భాగస్వాములైన ఏజెంట్లకు అన్యాయం చేయడం తగదన్నారు. ఇటీవల యాజమాన్యం తీసుకున్న తిరోగమన నిర్ణయాల వల్ల ఏజెంట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఐసీని నిర్వీర్యం చేసేందుకు యాజమాన్యం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అందరికీ బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించినప్పటికీ ఎల్ఐసీ పాలసీ ప్రీమియం పెంచడం దారుణమన్నారు. ఏజెంట్లకు నష్టం చేకూర్చే క్లాబ్లాక్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలిండియా కమిటీ సభ్యుడు కేవీ రమణ, జోనల్ కమిటీ సభ్యుడు బడ్డుకొండ వెంకటరమణ, బ్రాంచ్ అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ, కార్యదర్శి ఇల్లాపు కృష్ణ, కోశాధికారి తుమ్మలగుంటి పవన్‌కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపిక

పూసపాటిరేగ: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్–14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం బి.శంకరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరు 5 నుంచి 7వరకు జరిగే స్కూల్‌గేమ్స్‌లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 135 మంది క్రీడాకారులు పోటీలకు హాజరుకాగా 12 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పూసపాటిరేగ సర్పంచ్ టి.సీతారాం, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, స్కూల్‌గేమ్స్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి జి.తవిటయ్య, మండల ఇన్‌ఛార్జి పి.లీలాకృష్ణ, సెలక్షన్ కమిటీ ఇన్‌ఛార్జి పి.బంగార్రాజు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏఆర్ ఎస్పీ



ఎస్పీకి పూలమొక్కను అందజేస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ నాగేశ్వరరావు

విజయనగరం క్రైమ్: ఏఆర్ అదనపు ఎస్పీగా జి.నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసుల సంక్షేమం, సెక్యూరిటీ, ప్రముఖుల భద్రత, కుటుంబ సంక్షేమం, పరిపాలనపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని నాగేశ్వరరావును ఆదేశించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- ఎస్పీ వకుల్ జిందల్



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు తిరుమల మెడికవర్ ఆస్పత్రి వైద్య బృందం వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య శిబిరాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, సీఐలు పాల్గొన్నారు.

'కరవాక' పుస్తకావిష్కరణ



కరవాక పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: నగరంలోని గురజాడ స్వగృహంలో 'కరవాక' పుస్తకావిష్కరణ సభ వీఎంకే లక్ష్మణరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మల్లిపురం జగదీష్, ఆల్తి మోహనరావు మాట్లాడుతూ.. వివిధ శ్రామిక సమూహాల జీవితాలను తెరిచి చూపిన కవిత్వం 'కరవాక' అని వక్తలు విశ్లేషించారు. అధ్యయనం, పరిశీలనతోనే కవిత్వంలో సరళత సాధ్యమైందన్నారు. అత్యంత సరళతతో కవిత్వాన్ని చెప్పడం కవి ప్రతిభకు నిదర్శనమన్నారు. కరవాక పుస్తకాన్ని ప్రముఖ కవి రెడ్డి రామకృష్ణ ఆవిష్కరించగా, ఈ పుస్తకాన్ని ఎందుకు ముద్రించారో మిత్ర సాహితీ నిర్వహకులు నారాయణ వేణు వివరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీ అభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ నిధులు విడుదల చేయాలి



సబ్‌రిజిస్ట్రర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు

భోగాపురం: భోగాపురం సబ్ రిజిస్ట్రర్ పరిధిలో ఉన్న పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలలాకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ సర్ చార్జీలు జమకాలేదని, 3:1:1 నిష్పత్తిలో ఆయా మండలాలకు నిధులు కేటాయించి వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు భోగాపురం సబ్ రిజిస్ట్రార్ పి.రామకృష్ణకు సోమవారం వినతి పత్రం అందజేశారు. స్టాంప్ డ్యూటీ సర్ చార్జీ నిధులను త్వరితగతిన సంబంధిత గ్రామ పంచాయతీల అకౌంట్లలో జమ చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నష్టపరిహారం ఇప్పించాలని వినతి

భోగాపురం: భోగాపురం విమానాశ్రయం భూసేకరణలో నష్టపోయిన తనకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని, లేదంటే తన భూమిని తనకు తిరిగి ఇవ్వాలని భోగాపురం గ్రామానికి చెందిన మాత శిరోమణి తన కుమారుడితో కలిసి తహసీల్దార్ సురేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. శిరోమణి (భర్త లేటు సూర్యనారాయణ)కి గూడెపువలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 42–1లో 60 జిరాయితీల భూమి ఉంది. విమానాశ్రయం కోసం భూసేకరణలో భాగంగా అధికారులు ఆమెకు చెందిన 60 సెంట్ల భూమిని సేకరించి 27 సెంట్ల భూమికి మాత్రమే పరిహారం చెల్లించారు. దీనిపై ఆమె అప్పట్లో ఆర్డీఓ, జిల్లా కలెక్టర్‌ను కలిసి తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ప్రస్తుతం అదే భూమిలో జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు నిర్మిస్తుడంతో బాధితురాలు మరోసారి తహసీల్దార్‌ను కలిసి తనకు పూర్తి పరిహారం ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువ



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు 'ప్రజా దర్బార్' నిర్వహించారు. మండలంలోని 22 పంచాయతీల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా దర్బార్‌కు అధికంగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలపై వినతులు వచ్చినట్లు చెప్పారు. అలాగే పింఛన్ మంజూరు చేయాలని, సీసీరోడ్లు వేయాలని పలు వినతులు అందాయన్నారు. వాటన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొద్దల నరసింగరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

శిష్టకరణ సంఘం అభ్యున్నతికి కృషి

విజయనగరం టౌన్: శిష్టకరణ సంఘం అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.పి.గౌరీశ్వరరావు కోరారు. శిష్టకరణ సంఘం ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 24న సారిపల్లి రోడ్డులో శివాలయం పక్కన ఉన్న తోటలో కార్తీక వన సమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. శిష్టకరణ కులస్తులంతా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి హాజరు కావాలని కోరారు.

కరాటే విజేతలకు అభినందన

విజయనగరం అర్బన్: సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కరాటే క్రీడాంశంలో శిక్షణ పొందుతున్న పలువురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. విశాఖలో గంటా కనకారావు మెమోరియల్ ఇన్విటేషనల్ పేరుతో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. విజేతలను, కోచ్ కె.సంతోష్‌కుమార్, చీఫ్ కె.సుమన్‌ను సత్య కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎస్.సత్యవేణి, ఫిజికల్ డైరెక్టర్లు మహేష్, ప్రసాద్ అభినందించారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల: దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ చాంపియన్ షిప్‌కు నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన గండ్రేటి జనార్దన్, లెంక కైలాష్ ఎంపికైనట్లు సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ పీడీ, కోచ్ బొమ్మనరామారావు సోమవారం తెలిపారు. ఈనెల 30 నుంచి నవంబర్ 2 వరకు తమిళనాడులోని చెన్నైలో జరిగే పోటీల్లో ఆంధ్రా యూనివర్సిటీ తరపున వీరు పాల్గొంటారన్నారు. క్రీడాకారులను పీడీ రామారావు, నెల్లిమర్ల కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బోని సూర్యనారాయణ నాయుడు, సంఘం సభ్యులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తా..

నెల్లిమర్ల: కర్నూల్‌లో ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో నెల్లిమర్ల గాంధీనగర్ కాలనీకి చెందిన తాటిపూడి హేమసుందర్‌రావు సత్తా చాటాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో 14–18 సంవత్సరాల కేటగిరీలో హేమసుందర్‌రావు రజత పతకం సాధించినట్లు కోచ్ మద్దిల సంతోషిభారతి తెలిపారు. డిసెంబర్ 27, 28 తేదీల్లో ధన్‌భాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

బాలల హక్కుల కమిషన్ చైర్మన్ పరామర్శ

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలం కొఠారు బిల్లి జంక్షన్‌లో లైంగిక దాడికి గురై ఘోషాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సోమవారం పరామర్శించారు. బాధిత చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరాతీశారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వారికి సూచించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు మంగళవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కమిషనర్ పి.నల్లనయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధుపాడ వద్ద పంపింగ్ పైపులైన్ లీకులు మరమ్మతులు చేపట్టేందుకు తాగునీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 41, 47 డివిజన్‌లోని సంజీవ్‌నగర్ కాలనీ, గొల్ల వీధి, పార్క్ రోడ్, రెహమాన్ ఆస్పత్రి రోడ్డు, బజారు వీధి, గంజిపేట, బంగారమ్మ కాలనీ, గొడుగులు వీధి, స్వీపర్ కాలనీ, కాంబోవీధి, అరుంధతి నగర్, పీవీజీ నగర్ ప్రాంతాల్లో మంగళవారం తాగునీటి సరాఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సర్పంచ్‌లకే ఉపాధిహామీ పనులు అప్పగించాలి

భోగాపురం: మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉపాధిహామీ నిధులతో చేపట్టనున్న మెటీరియల్ కాంపొనెంట్ పనులు (వెండార్ ఐడీ వర్క్స్) సర్పంచులకే అప్పగించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచులతో కలిసి సోమవారం ఎంపీడీఓ కిషోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూటమి పార్టీల నాయకులకు అప్పగించడం చట్ట వ్యతిరేకమన్నారు. 2005 ఉపాధిహామీ చట్టం ప్రకారం గ్రామాల్లో చేపట్టే పనులు సర్పంచులకే అప్పగించాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం పనులు అప్పగించకుంటే ఆందోళన చేపడతామన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగుల నిరసన

విజయనగరం అర్బన్: లాంగ్వేజ్ పండిట్ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ నిరుద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసనలు తెలియజేశారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశాయని, అధికారంలోకి వచ్చాక హామీలను గాలికొదిలేశాయని మండిపడ్డారు. అనంతరం పలు సమస్యలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ వర్ధంతి సందర్భంగా గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నవంబరు 2న ఉదయం 10 గంటలకు గురజాడ స్వగృహంలో రెండో దశ పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో భోగరాజు బాబూజీ, సూర్యలక్ష్మి, డాక్టర్ జక్కు రామకృష్ణ, గురజాడ ఇందిర తదితరులున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: మండలంలోని కోరుకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,160 నగదు సీజ్ చేసినట్లు చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

NAME CHANGE
I, Swapna Pinninti spouse of No.14849339P Rank Hav Name Ganesh Pinninti resident of Vill. Kumaram, Jami Tehsil, Vizianagaram, Andhra Pradesh-535214 is declared that in my husband Service records (Sheet Roll) my name SWAPNA P is Wrong due to ignorance's and over sight. Actual Name is SWAPNA PINNINTI Correct vide there affidavit no:- IN-AP33916752560641W Dated:-26-10-2024.